# పొద్దుతిరుగుడు పూలు

-సబ్బని లక్ష్మీనారాయణ

"నేను ఆ అమ్మాయిని మనసారా ప్రేమించాను, ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించింది. ఆ అమ్మాయి నన్ను చూడండి రోజు వచ్చి మంచి నీళ్ళయినా ముట్ట దు" అన్న మా సుధాకర్ మాటలు వింటూ,

"నిజంగానా!" అన్నాను.

"మొన్న నా మీద పడి బోరున ఏడ్చింది" అన్నాడు ఇంక.

"ఎందుకట?" అన్నాను.

"నేను లేక తను బతుకదట, నేను తప్ప తనకు ఏమి అవసరం లేదట, నన్ను తప్ప ఎవర్నీ పెళ్ళి చేసు కోదట" అన్నాడు ఎంతో లోతుగా.

ఇది మా సుధాకర్ ప్రేమాయణం.

మా సుధాకర్ వయసు ఇరువై దాకా ఉంటుంది, వాడు డిగ్రీ చదువులో ఉన్నాడు. ఆ అమ్మాయి వయసు పదహారు పదిహేడు వరకుంటుంది. ఈ ప్రేమలో పడ డం అనేది వయసు మహత్యమేమో. వాళ్లిద్దరి ఇండ్లు దగ్గరి దగ్గర కావడం వల్ల ఇద్దరి దృష్టి ఒకరిపై పడి పోయింది. ఆ అమ్మాయిని చూడంది వీడు, వీడిని చూడండి ఆ అమ్మాయి ఉండలేని స్థితి వచ్చేసింది.

అయినా ఓసారి చెప్పి చూశాను మా సుధాకర్‌కు. "ప్రేమ అనేది పరస్పర ఆకర్షణ, ఈ వయసుకది సహజం. ఆ అమ్మాయి నిన్ను చూడంది రోజు పచ్చి మంచినీళ్ళయినా ముట్టదు, నిన్ను చూడండి బతుకదు అనేది నీ భ్రమ మాత్రమే. వాళ్ళ అన్నయ్యో, తండ్రో, బంధువులో ఈ విషయం గమనించి ఆ అమ్మాయిని చివాట్లు పెట్టి, నిన్ను నాలుగు తన్ని తగిలేసిన్నాడు, ఆ అమ్మాయి నీ ముఖం చూడడానికి కూడా రాదేమో. తనదాకా వస్తే ఆడపిల్ల ఎప్పటికి సేఫ్ సైడే చూసుకొం టుంది. నలుగుర్లో పరువుగా బతుకుతున్న కుటుంబ ములోని అమ్మాయి ఈ ప్రేమకథ నలుగురికి తెలిసేలా చేసుకోదు. అవసరమొస్తే ఆ తప్పంతా, బాధ్యత అంతా నీదే అంటుంది. ఒక మగవాడిగా ఆ అమ్మాయిని నువ్వు చెడగొడుతున్నావని అందరూ నిన్నే ఆడిపోసు కొంటారు. పైగా మీ ఇద్దరి కులాలు ఒకటి కావు. మీ ప్రేమను అర్థం చేసుకొనేంతగా ఎదగలేదు ఈ సమా జం. కాబట్టి ప్రేమ, పెళ్ళి అని ఆలోచించకు. కాబట్టి ఈ ప్రేమ కథకు ఫుల్‌స్టాప్ పెట్టి ఆ అమ్మాయికి దూ రంగా ఉండు" అన్నాను.

నేను చెప్పింది మా వాడి తలకు ఎక్కలేదు. అంతా విని "ఆ అమ్మాయి అలాంటిది కాదు, నా కోసం తన ప్రాణాన్నయినా ఇస్తుంది" అని అన్నాడు చాలా గొప్పగా.

"మరి ఏమి చూసి ప్రేమించావురా ఆ అమ్మాయిని" అని అడిగాను.

"ఆ అమ్మాయి మనసును చూసి అన్నాడు, ఇంకా ఆ సొట్ట బుగ్గల్ని చూసి" అన్నాడు ఇష్టంగా.

"మరి ఏమి చేద్దామనుకొంటున్నారు" అన్నాను.

"పెళ్ళి చేసుకొందామనుకొంటున్నాం ముందు ముందు" అన్నాడు.

కాలం మూడు నెలలు గడచిపోయింది. ఈ మూ డు నెలల్లో వాళ్లు చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. గుడులు గోపురాలు దర్శించారు, పార్కులకు షికార్లకు వెళ్ళారు. హోటల్లలో తిన్నారు, సినిమాలకు కలిసి వెళ్ళారు. కాని ఒకనాడు మంచి ముహూర్తంలోనో చెడు ముహూర్తం లోనో మా సుధాకర్, ఆ అమ్మాయి ఓ పార్క్ చెంత ఆ అమ్మాయి తల్లిదండ్రుల తాలూకు బంధువులకు దొరికి పోయారు. వాళ్లు మా సుధాకర్ను చితకబాది ఆ అమ్మా యిని తీసుకొని వెళ్లిపోయారు.

తెల్లవారి దెబ్బలతో కట్లతో ఆస్పత్రి నుంచి ఇంటికి చేరి మంచం పట్టి ఆ అమ్మాయిని తలుస్తూ కన్నీరు పెట్టాడు మావాడు. బహుశా ఆ అమ్మాయి తన కోసం వస్తుందని, తనను కలుస్తుంది అని ఆశించాడు, ఎదురు చూశాడు. కాని ఆ అమ్మాయి రాలేదు. మావాడు నిరాశ పడిపోయాడు. కాస్త ఆరోగ్యం కుదుట పడ్డ తరువాత ఆ అమ్మాయి కోసం వెళ్లి గమనించి చూశాడు. అమ్మా యి తనకోసం వస్తుందేమోనని, తనకోసం చూస్తుందే మోనని. కాని మా వాడి ఆశలు ఫలించలేదు. ఆ అమ్మాయి వచ్చే జాడే కనిపించలేదు. మావాడు దిగులు పడ్డాడు. బాధపడ్డాడు.

ఒక శుభ ముహూర్తాన మా వాడి గుండెల మీంచి నడిచి వెళ్లిపోయింది రొటీన్‌గా. కాలం నెలలు, సంవత్స రాలు గడిచిపోయింది, ఎప్పుడన్నా కనిపించినా తనను గమనించినట్లుగా తెలియని దానిలానే వెళ్లిపోయేదని మావాడు చెప్పగా విన్నాను. మావాడు కూడా కాల గమనంలో మారుతూ వచ్చి తను కూడా పెళ్ళి చేసుకొని బతుకులో స్థిరపడిపోయి కాలాన్ని రొటీన్‌గా గడిపేస్తు న్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తే నాకు పొద్దునుసరించి తిరిగే పొద్దుతిరుగుడు పువ్వులు అనిపించింది. ■